కేసీఆర్ తలుచుకొంటే రేవంత్ జైల్లోనే

- కుర్చీలకోసం పార్టీలు మారే వ్యక్తి రేవంత్
- రేవంత్ డీఎన్ఏ తెలుసుకో రాహుల్
- నాడు సోనియాను బలిదేవత అన్నడు
- రేవంత్ ఏ ఎండకు ఆ గొడుగుపట్టే రకం
- ధరణిని వ్యతిరేకిస్తే పార్టీ సముద్రంలోకే
- బీజేపీ, కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మట్లేదు
- బీఆర్ఎస్ బీ టీం కాదు.. ప్రజల టీం
- ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ పాలపిట్ట
- హ్యాట్రిక్ సీఎం చేయాలనేదే ప్రజల కోరిక
- సంగారెడ్డి జిల్లా పర్యటనలో మంత్రి హరీశ్

నారాయణఖేడ్‌లో నిర్వహించిన అలయ్‌బలయ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తదితరులు

సంగారెడ్డి, అక్టోబర్ 24 నమస్తే తెలంగాణ: కేసీఆర్ తలుచుకొంటే ఓటుకు నోటు కేసులో టీపీసీసీ చీఫ్ రేవంత్‌ను జైల్లో వేసేవారని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. 'పక్క రాష్ట్రాల్లో చూస్తున్నాం వాళ్లు గెలువగానే వీళ్లను జైలుకు పంపిస్తారు. వీళ్లు గెలువగానే వాళ్లను జైలుకు పంపిస్తారు. అలాంటి పరిస్థితి తెలంగాణలో లేదు' అని అన్నారు. కుర్చీల కోసం పార్టీలు మారే వ్యక్తి రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఈ నెల 30న సీఎం కేసీఆర్ బహిరంగ సభ నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించారు. కార్యకర్తల సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీపై పోరాడే డీఎన్ఏ తనదని గొప్పగా చెప్పుకొనే రాహుల్‌గాంధీ.. టీపీసీసీ చీఫ్ రేవంత్ డీఎన్ఏ ఏమిటో ముందు తెలుసుకోవాలని చురకలంటించారు. బీజేపీపై పోరాటం చేసే రాహుల్ డీఎన్ఏతో రేవంత్‌రెడ్డి డీఎన్ఏ మ్యాచ్ కావడం లేదని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి పదవుల కోసం ఏబీవీపీతో మొదలు పెట్టి బీజేపీ, టీడీపీ, కాంగ్రెస్ పార్టీల్లోకి వరుసగా మారారని గుర్తుచేశారు.

ధరణి జోలికొస్తే కాంగ్రెస్ ఖతమే

దేశంలోకి రాజీవ్‌గాంధీ కంప్యూటర్లు తీసుకువచ్చారని గొప్పలు చెప్పుకొనే రాహుల్ గాంధీ.. కేసీఆర్ తీసుకువచ్చిన ధరణిని గుడ్డిగా వ్యతిరేకించడం సరికాదని హరీశ్‌రావు సూచించారు. రాష్ట్రంలోని 69 లక్షల మంది రైతుల భూ రికార్డులను డిజిటలైజేషన్ చేసి ఆన్‌లైన్‌లో ఉంచామని చెప్పారు. ధరణి కారణంగా రైతులు ఇంట్లో నుంచి కదలకుండా ప్రభుత్వం అందజేసే రైతు బంధు సాయాన్ని పొందుతున్నారని చెప్పారు. అలాంటి ధరణిని వ్యతిరేకిస్తే ప్రజలు కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో కలుపుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీని తెలంగాణ ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే మాటలు.. మూటలు... ముఠాలు.. అని ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్ తెలంగాణ పాలపిట్ట అని కొనియాడారు. కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా చూడాలని తెలంగాణ ప్రజలు నిర్ణయించుకున్నారని మంత్రి హరీశ్‌రావు తెలిపారు.

తెలంగాణ ద్రోహి రేవంత్

రేవంత్‌రెడ్డి ఏ ఎండకు ఆ గొడుగు పట్టే రకమని మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. టీడీపీలో ఉన్నప్పుడు సోనియాను బలిదేవత, ఇటలీ బొమ్మ అంటూ నోటికి వచ్చినట్టు తిట్టారని, కాంగ్రెస్‌లో చేరాక అదే సోనియాను దేవత అంటూ పొగడటం రేవంత్‌రెడ్డికే చెల్లుతుందని ఎద్దేవా చేశారు. తెలంగాణ కోసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయమంటే రేవంత్ చేయలేదని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమకారులపైకి తుపాకీ ఎక్కుపెట్టిన ద్రోహి రేవంత్ అని మండిపడ్డారు. నాడు ఓటుకు నోటు, నేడు నోటుకు సీటు అని కాంగ్రెస్ నాయకులే రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడుకుంటున్నారని తెలిపారు. అలాంటి వ్యక్తులు సీఎం కావాలా? రాష్ట్రం కోసం నిరంతరం కష్టపడే కేసీఆర్ సీఎం కావాలా? అన్నది ప్రజలు ఆలోచించాలని కోరారు. బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే సత్తా లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణ కోసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా ముఖం చాటేసిన వ్యక్తి కిషన్‌రెడ్డి అని దుయ్యబట్టారు. కేసీఆర్ చేతుల్లో ఉంటేనే రాష్ట్రం పదిలంగా ఉంటుందని చెప్పారు. ప్రజలు సైతం ఇదే ఆలోచనలో ఉన్నారని తెలిపారు.

కేసీఆర్ పాలనలో కరువు, కర్ఫ్యూలు లేవు

ముఖ్యమంత్రి కేసీఆర్ తొమ్మిదేండ్ల పాలనలో రాష్ట్రంలో కరువు, కర్ఫ్యూలు లేవని హరీశ్‌రావు పేర్కొన్నారు. దేశానికే ఆదర్శంగా తెలంగాణను తీర్చిదిద్దారని తెలిపారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు తరలివస్తున్నాయని చెప్పారు. దేశం మొత్తం బొగ్గు నిల్వలు లేక కరెంటు కోతలు ఉంటే ఒక్క తెలంగాణలో మాత్రమే 24 గంటల కరెంటు సరఫరా అవుతున్నదని, ఇది దమ్మున్న నాయకుడు సీఎం కేసీఆర్ వల్లే సాధ్యమైందని పేర్కొన్నారు. రైతులకు డబ్బులు ఇచ్చిన ఏకైక వ్యక్తి కేసీఆర్ అని కొనియాడారు. రైతు వ్యవస్థ బలోపేతం కోసం సీఎం కేసీఆర్ ధరణిని తీసుకువస్తే దానిని రద్దు చేస్తానని కాంగ్రెస్ నేతలు చెప్పటం సిగ్గుచేటని పేర్కొన్నారు. ధరణి రద్దు చేసి తిరిగి పటేల్, పట్వారీ వ్యవస్థ తెచ్చి రైతుల ఉసురుపోసుకుంటారా? అని కాంగ్రెస్ నేతలను ప్రశ్నించారు. మంత్రి హరీశ్‌రావు పర్యటనలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జడ్పీ చైర్‌పర్సన్ మంజూ శ్రీజైపాల్‌రెడ్డి, టీఎస్‌టీపీసీ చైర్మన్ మఠం భిక్షపతి, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, టీఎన్జీవో మాజీ అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, పార్టీ మండలాధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకం పోకడ

బట్టలతో పాటు మనకాలనీకి వచ్చిన కాంగ్రెస్ లీడర్‌ని కూడా ఉతికి ఆరేశా పిన్నీ!

చలి మొదలు

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చలి ప్రారంభమైంది. రుతుపవనాలు తిరుగుముఖం పట్టడంతో రాష్ట్రం వైపు చలిగాలులు వీస్తున్నాయి. హనుమకొండలో కనిష్ఠ ఉష్ణోగ్రత 19.5 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 17.2 డిగ్రీలు నమోదైంది. పగటివేళ హనుమకొండ, మెదక్, రామగుండంలలో ఉష్ణోగ్రతలు చాలా వరకు తగ్గాయి. ఖమ్మంలో మాత్రం సాధారణం కన్నా 3.3 డిగ్రీలు అధికంగా.. గరిష్ఠంగా 35.2 డిగ్రీలు నమోదైంది.వచ్చే రెండు మూడ్రోజులు ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

తుఫానుగా మారిన అల్పపీడనం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం సోమవారం సాయంత్రం తుఫానుగా మారిందని, దానికి 'హమూన్'గా పేరు పెట్టారని భారత వాతావరణశాఖ మంగళవారం వెల్లడించింది. హమూన్‌తో ఒడిశా తప్పా భారత తీరంపై అంతగా ప్రభావం ఉండకపోవచ్చని అంచనా వేసింది.

సీట్లు అమ్మినోళ్లు రాష్ట్రాన్ని అమ్మేస్తరు!

- సీఎం కేసీఆర్ చేతుల్లోనే రాష్ట్రం పదిలం
- తగాదాలతో రాష్ట్రం అభివృద్ధి చెందదు
- పెరిగే సంపదను బట్టి మ్యానిఫెస్టో
- బీఆర్ఎస్, బీజేపీ ఎన్నటికీ కలవబోవు
- సంక్షేమ పథకాలను ఉచితాలు అనవద్దు
- వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులకు టికెట్లు అమ్ముకుంటున్న కాంగ్రెస్ పార్టీ రేపు రాష్ట్రాన్ని కూడా అమ్మకానికి పెడుతుందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. సీఎం కేసీఆర్ చేతుల్లోనే రాష్ట్రం పదిలంగా ఉంటుందని ప్రజలు ఎప్పుడో నిర్ణయించుకున్నారని చెప్పారు. ఓ టీవీ చానల్‌లో జరిగిన చర్చలో మంత్రి హరీశ్‌రావు పాల్గొని అనేక అంశాలపై మాట్లాడారు. కాంగ్రెస్ రెండో జాబితా విడుదల చేసిన తర్వాత ఎంతమంది బయటికి వస్తారో, ఎంతమంది బీఆర్ఎస్‌లో చేరుతారో చూడాలని అన్నారు. ఈ రోజు సీట్లు అమ్ముకున్న వారు రేపు రాష్ట్రాన్ని అమ్ముకోరా? అని ప్రజలు ఆలోచిస్తున్నారని చెప్పారు. ముఠా తగాదాలతో రాష్ట్రం అభివృద్ధి చెందదని అన్నారు. 'మేము ఒకే లీడర్ కేసీఆర్ అని చెప్తాం. వాళ్లు చెప్పగలరా? అక్కడ సీఎంలు ఎక్కువ. పదవులపైనే వాళ్లకు శ్రద్ధ' అని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీలు ద్వితీయ స్థానం కోసమే పోటీ పడుతున్నాయని అన్నారు.

కేసీఆర్ నేతృత్వంలోనే స్థిరమైన ప్రభుత్వం

2014లో తెలంగాణ ఇచ్చింది మేమే.. టీఆర్ఎస్ అవసరమా అని కాంగ్రెస్ ఎద్దేవా చేసిందని, ఏం జరిగిందో ప్రతి ఒక్కరికీ తెలుసునని హరీశ్ చెప్పారు. 2018లో అనేక పార్టీలు కలిసి వచ్చినా, బీఆర్ఎస్‌కు ఎక్కువ సీట్లు వచ్చాయని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడిందని చెప్పారు. ఈసారి కూడా అదే జరుగుతుందన్నారు. సీఎం కేసీఆర్ పట్ల ప్రజల్లో సానుకూల దృక్పథం ఉన్నదని, గతంలో కన్నా ఎక్కువ మెజార్టీతో మళ్లీ అధికారం కట్టబెట్టడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్రాన్ని ఇప్పటికే బలీయమైన ఆర్థిక శక్తిగా మార్చామని, రాబోయే కాలంలో పెరుగబోయే సంపదను దృష్టిలో ఉంచుకొనే సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోలో హామీలు ఇచ్చారని తెలిపారు. రైతుబంధు ప్రారంభించినప్పుడు చాలా అనుమానాలు వ్యక్తం చేశారని, కానీ విజయవంతంగా 11 దఫాలుగా అందించామని గుర్తు చేశారు.

కేటీఆర్ బాగా పనిచేస్తున్నారు

మంత్రి కేటీఆర్ బాగా పనిచేస్తున్నారని హరీశ్‌రావు కితాబిచ్చారు. సోషల్ మీడియాలో చూస్తే కర్ణాటక, తమిళనాడు ఇలా అనేక రాష్ట్రాల వారు ఇలాంటి ఐటీ మినిస్టర్ మాకు కూడా ఉంటే బాగుండు అని కామెంట్లు పెడుతున్నారని తెలిపారు. అనేక దేశాలు, అంతర్జాతీయ యూనివర్సిటీలు నిర్వహించే సెమినార్లకు మంత్రి కేటీఆర్‌ను ఆహ్వానిస్తున్నాయని గుర్తుచేశారు. 'బాగా పనిచేస్తేనే కదా వాళ్లు పిలిచేది' అని అన్నారు. ఆయన తన పనితీరుతో రాష్ట్ర ఇమేజ్‌ను, ప్రభుత్వ ఇమేజ్‌ను పెంచుతున్నారని కొనియాడారు.

ఎమ్మెల్యేల కేంద్రంగానే..

నియోజకవర్గాల్లో ప్రభుత్వ కార్యక్రమాలైనా, పార్టీ కార్యక్రమాలైనా ఎమ్మెల్యేలు కేంద్రంగా నడవాలన్నదే సీఎం కేసీఆర్ ఆలోచన అని హరీశ్ చెప్పారు. పదవులు ఇచ్చి ముగ్గురు నలుగురిని ప్రోత్సహిస్తే గ్రూపు రాజకీయాలు, వెన్నుపోట్లు మొదలవుతాయని అన్నారు. అందుకే ఎమ్మెల్యే అభ్యర్థులను మార్చాల్సిన అవసరం రాలేదని చెప్పారు. ఎమ్మెల్యే ఎవరు అనేదానికన్నా ఎవరు సీఎం అయితే బాగుంటుందో, రాష్ట్రం ఎవరి చేతుల్లో ఉంటే పదిలంగా ఉంటుందో ఓటర్లు ఆలోచిస్తారని తెలిపారు. మరోసారి సీఎం కేసీఆర్ చేతుల్లో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని నిర్ణయించుకున్నారని స్పష్టం చేశారు.

ఉచితాలుగా చూడొద్దు

సంక్షేమం కోసం ప్రభుత్వం ఇచ్చేవాటిని ఉచితాలు అనవద్దని హరీశ్‌రావు సూచించారు. రైతు బంధు, రైతుబీమా వంటివాటి వల్ల రైతులు ఆర్థికంగా బలపడ్డారని, ఆత్మహత్యలు ఆగిపోయాయని చెప్పారు. వ్యవసాయ రంగం బలోపేతం అయితే రైతులతోపాటు ట్రాక్టర్ డ్రైవర్లు మొదలు రైస్‌మిల్లుల యజమానులు, బస్తాలు మోసే హమాలీల వరకు ఎంతోమందికి ఉపాధి దొరికిందని చెప్పారు. కల్యాణలక్ష్మి పథకం ఉచితం కాదని.. చట్టమో, పోలీసులో చేయలేని పనిని ఈ పథకం చేసిచూపెట్టిందని అన్నారు. 18 ఏండ్లు నిండితేనే పథకం వర్తిస్తుందనే నిబంధన వల్ల ఓవైపు బాల్య వివాహాలు తగ్గాయని, మరోవైపు మహిళల్లో అక్షరాస్యత రేటు పెరిగిందని చెప్పారు.

ఉద్యోగాల భర్తీకి కట్టుబడి ఉన్నాం

మొదటి విడతలో 1.42 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశామని, ఈ దఫా మరో 80 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నదని హరీశ్ పేర్కొన్నారు. ఈసారి నోటిఫికేషన్లు కాస్త ఆలస్యం అయ్యాయని, అయితే ఇందుకు కారణాలు ఉన్నాయన్నారు. ఎన్నికల నేపథ్యంలో తాత్కాలికంగా బ్రేక్ పడిందని, మళ్లీ ప్రభుత్వంలోకి రాగానే పూర్తి చేస్తామని చెప్పారు. మరోవైపు ప్రైవేట్ రంగంలోనూ భారీగా ఉద్యోగాల కల్పన జరుగుతున్నదన్నారు.

ఎన్డీయేతో ఉండలేదు.. ఉండబోము

బీఆర్ఎస్, బీజేపీ ఎన్నటికీ కలువవని హరీశ్ స్పష్టంచేశారు. రాష్ట్రంలో బీజేపీకి వచ్చిన హైప్ పాలపొంగులాంటిదని సీఎం కేసీఆర్ చెప్పేవారని, ఇప్పుడు అదే నిజమైందని అన్నారు. మంత్రి కేటీఆర్‌ను సీఎం చేయాలని కేసీఆర్ ప్రయత్నించారంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై హరీశ్ మండిపడ్డారు. 'అప్పుడే ఎందుకు చెప్పలేదు? ఎన్నికల ముందే ఎందుకు చెప్తున్నారు?' అని ప్రశ్నించారు.

బీఆర్ఎస్‌లో చేరిన రమాకాంత్‌రావు, ఆయన అనుచరులతో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు

బీఆర్ఎస్‌లోకి బీజేపీ నేత రమాకాంత్

గులాబీ కండువా కప్పి ఆహ్వానించిన మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు

రాజన్న సిరిసిల్ల/హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సిరిసిల్ల జిల్లాకు చెందిన సీనియర్ న్యాయవాది ఆవునూరి రమాకాంత్‌రావు మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ విజయానికి తనవంతు కృషి చేస్తానని రమాకాంత్‌రావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో అన్నీ గ్రూపు రాజకీయాలే

బీజేపీలో పైకి కనిపించేది సిద్ధాంతం.. లోపలన్నీ గ్రూపు రాజకీయాలేనని రమాకాంత్‌రావు విమర్శించారు. అంతకుముందు సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బండి నాయకత్వాన్ని నమ్ముకుని బీజేపీలో చేరామని, ఇప్పుడు తమకు అన్యాయం జరిగితే నోరుమెదపలేదడం లేదని ఎంపీ సంజయ్‌పై మండిపడ్డారు. స్థానిక కార్యకర్తలు, నాయకులతో చర్చించకుండా నర్సంపేటకు చెందిన రాణిరుద్రమకు సిరిసిల్ల టికెట్ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. రాణిరుద్రమకు సిరిసిల్ల అసెంబ్లీ అభ్యర్థిగా టికెట్ ఇస్తున్న విషయం తమకు తెలిపితే సహకరించేవాళ్లమని చెప్పారు. బీజేపీని నమ్మి నాలుగున్నరేండ్ల కింద పార్టీలో చేరానని, 25 ఏండ్ల తన న్యాయవాద వృత్తి, భార్యాపిల్లలను పక్కనపెట్టి పార్టీ ఎదుగుదల కోసం కష్టపడ్డానని, అయినా.. ఫలితం దక్కలేదని వాపోయారు. పార్టీ తీసుకున్న నిర్ణయంపై మనస్తాపంతో బీజేపీకి, కార్యవర్గ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. రాజీనామా పత్రాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ బండి సంజయ్‌కి పంపించినట్టు తెలిపారు.

రేపట్నుంచి బడులు, కాలేజీలు పునఃప్రారంభం

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): దసరా సెలవుల అనంతరం రాష్ట్రంలోని విద్యాసంస్థలు గురువారం నుంచి పునఃప్రారంభంకానున్నాయి. దసరా, బతుకమ్మ పండుగలను పురస్కరించుకొని స్కూళ్లకు ఈ నెల 13 నుంచి 25 వరకు, జూనియర్ కాలేజీలకు 19 నుంచి 25, పాలిటెక్నిక్ కాలేజీలకు 14 నుంచి 24 వరకు సెలవులు ప్రకటించారు. పాలిటెక్నిక్ కాలేజీలు బుధవారం నుంచే ప్రారంభంకానుండగా, మిగతా విద్యాసంస్థలు గురువారం నుంచి తెరుచుకొంటాయి.

ఎన్సీటీఈ సభ్యుడిగా ప్రొఫెసర్ పారిపల్లి శంకర్



హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్సీటీఈ) సభ్యుడిగా ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పారిపల్లి శంకర్ నియమితులయ్యారు. దక్షిణ ప్రాంత ఎన్సీటీఈ కమిటీకి ఒక చైర్మన్‌తో పాటు ఐదుగురు సభ్యులను నియమించారు. ఈ కమిటీలో ప్రొఫెసర్ శంకర్‌కు చోటు లభించింది. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణానికి చెందిన శంకర్ ఓయూ ఎడ్యుకేషన్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గత కమిటీలోనూ శంకర్ ఎన్సీటీఈ సభ్యుడిగా వ్యవహరించగా, ఆయన సేవలను గుర్తించి రెండోసారి అవకాశం కల్పించారు. రాష్ట్రంలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ వర్సిటీ ప్రొఫెసర్ ఎం వనజ కూడా దక్షిణ ప్రాంత ఎన్సీటీఈ సభ్యురాలిగా నియమితులయ్యారు. తూర్పు, పశ్చిమ, ఉత్తర, దక్షిణ ప్రాంతాలకు కొత్త కమిటీలను నియమిస్తూ ఎన్సీటీఈ ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ కమిటీలు రెండేండ్ల పాటు అమల్లో ఉంటాయని ఎన్సీటీఈ సభ్యకార్యదర్శి కేసాంగ్ వై షెర్పా వెల్లడించారు.

ఘనంగా దసరా వేడుకలు

రాష్ట్రవ్యాప్తంగా దసరా పండుగను సోమవారం ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. హనుమకొండలోని పద్మాక్షిగుట్ట వద్ద నిర్వహించిన రావణ దహన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

వచ్చే వారం నుంచి పత్తి కొనుగోళ్లు

- మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కేంద్రాలు
- 350 కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు
- ప్రస్తుతం మద్దతు ధరకు మించి రేటు
- మార్కెట్‌లో పత్తి ధర పడిపోతే మద్దతు ధరతో కొనుగోలుకు చర్యలు



హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో వచ్చే వారం నుంచి పత్తి కొనుగోళ్లు జరుగనున్నాయి. ఇందుకోసం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 350 కేంద్రాలను ప్రారంభించే అవకాశం ఉన్నది. ప్రస్తుతం మార్కెట్లో క్వింటా పత్తికి మద్దతు ధర రూ.7,020గా ఉన్నది. ఈ ధర దక్కాలంటే పత్తిలో తేమ 8% మాత్రమే ఉండాలి. కానీ, 16-17% తేమ ఉన్నప్పటికీ ప్రైవేట్ వ్యాపారులు రూ.6,800 నుంచి రూ.7 వేలకు కొనుగోలు చేస్తున్నారు. దీని ప్రకారంగా చూస్తే సాధారణ తేమ శాతం వద్ద క్వింటా పత్తి రూ.7,300 వరకు ధర పలుకుతున్నట్టే. ప్రస్తుతం నల్లగొండ జిల్లాలో పత్తి రాక మొదలైంది. మరో 10-15 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పత్తి కోతకు వస్తుంది. దీంతో మార్కెట్లో ధర పడిపోయే అవకాశం ఉన్నదని వ్యాపారులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలోనే రైతులకు నష్టం కలగకుండా చూసేందుకు ప్రభుత్వం ముందుగానే కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేస్తున్నట్టు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి తెలిపారు. ఒకవేళ బయట మార్కెట్ పడిపోతే కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు పత్తిని కొనుగోలు చేస్తామని చెప్పారు. ఈ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 44.77 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. దీంతో దాదాపు 40 లక్షల బేళ్ల పత్తి ఉత్పత్తి అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

రేపు మెకానికల్ అసిస్టెంట్ ఇంజినీర్ పరీక్ష

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): మెకానికల్ అసిస్టెంట్ ఇంజినీర్ ఉద్యోగాల నియామక రాత పరీక్షకు టీఎస్‌పీఎస్సీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గురువారం రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నారు. సీబీఆర్‌టీ పద్ధతిలో పరీక్ష జరుగుతుంది. రాష్ట్రంలో 833 ఏఈ, టీవో, జేటీవో ఉద్యోగాల భర్తీకి నిరుడు సెప్టెంబర్ 12న టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పటికే 18, 19, 20న సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగాల్లో అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ), టెక్నికల్ ఆఫీసర్ (టీవో), జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ (జేటీవో) ఉద్యోగాల భర్తీకి పరీక్షలు జరిగాయి.

ఇంటర్‌లో ఒక ఇంటర్నల్ రద్దు

- ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్ష తొలగింపు
- ఇంగ్లిష్‌లో ప్రాక్టికల్స్ నేపథ్యంలో ఇంటర్‌బోర్డు నిర్ణయం

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): పరీక్షల సంస్కరణల్లో భాగంగా ఇంటర్‌బోర్డు కీలక నిర్ణయం తీసుకొన్నది. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఒక ఇంటర్నల్ పరీక్షను రద్దు చేసింది. ఈ విద్యాసంవత్సరం నుంచి ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్షను తొలగిస్తున్నట్టు ఇంటర్‌బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ ఇటీవలే ఉత్తర్వులు జారీ చేశారు. ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ పాఠ్యాంశాలను లాంగ్వేజెస్ సబ్జెక్టుల్లో విలీనం చేయడం వల్ల ఈ పరీక్షను రద్దు చేస్తున్నట్టు తెలిపారు. మరో ఇంటర్నల్ అయిన ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షను యథాతథంగా నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. వంద మార్కుల ఈ ఇంటర్నల్ పరీక్షను కాలేజీలోనే నిర్వహించి, అదే కాలేజీ లెక్చరర్లు మూల్యాంకనం చేసి, మార్కులేస్తారు. ఇది క్వాలిఫైయింగ్ పేపర్ కాగా, ఈ మార్కులను రెగ్యులర్ మార్కుల్లో కలపరు. ఈ విద్యాసంవత్సరం నుంచి ఫస్టియర్‌లో ప్రాక్టికల్స్ అమలుచేయనుండటంతో థియరీకి, ప్రాక్టికల్స్‌కు వేర్వేరు పాఠ్యపుస్తకాలను బోర్డు సిద్ధం చేసింది. ఇంగ్లిష్ సబ్జెక్టు పుస్తకాల్లో ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ పాఠ్యాంశాలు అంతర్భాగంగా ఉండటంతో ప్రత్యేకంగా పరీక్ష అవసరం లేదని అధికారులు భావించి, ఈ మేరకు నిర్ణయం తీసుకొన్నారు.

వర్షకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	37.2°c	21.0°c
ఆదిలాబాద్	34.8°c	14.9°c
రంగారెడ్డి	34.6°c	13.0°c
మెదక్	34.3°c	14.9°c
ఖమ్మం	34.0°c	22.0°c
నిజామాబాద్	33.1°c	19.0°c
మహబూబ్‌నగర్	32.6°c	22.1°c
వరంగల్	32.0°c	19.0°c
కరీంనగర్	32.0°c	19.0°c
హైదరాబాద్	32.0°c	18.0°c

నిపుణ విద్య, ఉద్యోగ సమాచారం

మెడికల్ ఆఫీసర్లు

ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్‌లో షార్ట్ సర్వీస్ కమిషన్ మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 650
- పోస్టులు: మెడికల్ ఆఫీసర్
- వీటిలో పురుషులు-585, మహిళలు-65
- అర్హతలు: ఎంబీబీఎస్, పీజీ డిగ్రీ ఉత్తీర్ణత
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 5
- వెబ్‌సైట్: www.amcsscentry.gov.in

సీఐటీడీలో..

హైదరాబాద్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ టూల్ డిజైన్ (సీఐటీడీ)లోని ఎంఎస్ఎంఈ టూల్ రూంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 6
- పోస్టులు: హార్డ్‌వేర్, నెట్‌వర్కింగ్ ఇంజినీర్, టూల్ డిజైనర్ తదితరాలు
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- ఇంటర్వ్యూ తేదీ: అక్టోబర్ 28
- వెబ్‌సైట్: https://www.citdindia.org

బీహెచ్‌ఈఎల్‌లో..

భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 75
- పోస్టులు: సూపర్‌వైజర్ ట్రెయినీ
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: నవంబర్ 15
- వెబ్‌సైట్: https://www.bhel.com

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- కరెంట్ అఫైర్స్, ఐఐటీ నీట్ ఫౌండేషన్- కెమిస్ట్రీ, ఇంగ్లిష్ కోసం పైన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.